క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులు తనిఖీ

నిమ్మనపల్లె : మండలంలోని కొండయ్యగారి పల్లె తవళం పంచాయతీలోని చింతలవారిపల్లెలో జరుగుతున్న పారిశుధ్య పనులను బుధవారం ఎంపీడీఓ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు తనిఖీ చేశారు. చింతలవారిపల్లెలో వాటర్‌ట్యాంక్ క్లోరినేషన్ క్లీనింగ్ పనులను పర్యవేక్షించారు. చెత్త సేకరణపై సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

20న ఆడికృత్తిక మహోత్సవం

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథం కార్యసిద్ధి అభయాంజనేయస్వామి దేవాలయ ఆవరణలో ఈ నెల 20న ఆడికృత్తిక మహోత్సవం నిర్వహించనున్నట్లు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఆలయ ఆవరణలో వెలసి శ్రీసుబ్రమణ్యస్వామికి 20న ఆదివారం ఉదయం ప్రథమ కాలాభిషేకం, మధ్యాహ్నం ద్వితీయ కాలాభిషేకం, సాయంత్రం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి కళ్యాణోత్సవం, రాత్రి 10 గంటలకు తృతీయ కాలాభిషేకం, ఆ రోజు పూర్తిగా కావడుల సమర్పణ జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి జాతర

రామసముద్రం: మండలంలోని గుంతలపేట గ్రామంలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారి జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతిహోమం, శాంతిహోమం, అభిషేకం నిర్వహించి కుంకుమార్చన, విశేషాలంకరణ చేశారు. భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. విద్యుత్ దీపాలంకరణతో గ్రామంలో సందడి నెలకొంది. మహిళలు ఉపవాసాలతో దీపాలు మోసి మొక్కులు చెల్లించుకున్నారు.

గురుకుల పాఠశాలకు డస్ట్‌బిన్‌ల వితరణ

కలకడ : మండలంలోని కలకడ కస్తూర్బా గాంధి బాలికల గురుకుల పాఠశాలకు హెచ్‌పీసీఎల్ కలకడ బూస్టర్ స్టేషన్ చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి రూ.20వేలు విలువ చేసే 10స్టీల్ డస్ట్‌బిన్‌లను వితరణ చేశారు. బుధవారం స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని, తరగతి గదులలో, పాఠశాల ఆవరణలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. పాఠశాల ఆరు బయట కూడా డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, పాఠశాల ఆవరణం మొత్తం పరిశుభ్రత బాధ్యత విద్యార్థులు, సిబ్బంది తీసుకోవాలని కోరారు. ఉత్తమ విద్యతోనే ఉన్నతశిఖరాలు సాధ్యమని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత, సిబ్బంది, హెచ్‌పీసీఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

పీలేరు : ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఎరువుల దుకాణాలు నిర్వహించాలని తిరుపతి విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం పీలేరు పట్టణంలోని పలు ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. షాపుల్లోని రికార్డులు, స్టాకు వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన పత్రాలు లేని 130 బ్యాగుల గ్రీన్‌స్టార్ ఎరువులు, జేటీఆర్ ఆగ్రో హైఇళ్ల్స్ 30.5 లీటర్ల పురుగుమందులు సీజ్ చేసినట్లు వివరించారు. ఎమ్మార్పీ ధరలకే నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అమ్మాలని కోరారు. కార్యక్రమంలో కల్యాణదుర్గం ఏడీఏ యల్లప్ప, రాయచోటి టీఏ పవన్, పీలేరు మండల వ్యవసాయాధికారిణి రమాదేవి, ఏఈవో నజీర్ పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు చదువుతో పాటు వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ మల్లేశ్వరి అన్నారు. స్థానిక చంద్రాకాలనీలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో వరల్డ్ స్కిల్స్ డే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో వృత్తి విద్యా శిక్షణ అందుబాటులో ఉందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థినులకు కుట్లు, అల్లికలు, డ్రాయింగ్, స్పీచ్‌లపై పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.

వేడుకగా పీర్ల ఊరేగింపు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంట, తుమ్మరకుంటవారిపల్లిలో బుధవారం పీర్ల ఊరేగింపు వేడుకగా నిర్వహించారు. పీర్లను పుష్పాలతో అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ నెల 17న సామాడుపల్లి, బొమ్మిరెడ్డిపల్లి, గజ్జెలవారిపల్లి, 18న బండమీదపల్లి, బురదవాండ్లపల్లిలో పీర్ల ఊరేగింపు నిర్వహించనున్నట్లు ప్రజలు తెలిపారు.

డ్రిప్ పైపుల అపహరణ

పెద్దతిప్పసముద్రం: స్థానిక రంగసముద్రం రోడ్డులోని వ్యవసాయ బోరు వద్ద ఉన్న డ్రిప్ పైపులను గుర్తు తెలియని దుండగులు అపహరించుకెళ్ళినట్లు బాధిత రైతు బీ.మంజునాథ్ బుధవారం పేర్కొన్నాడు. మండల కేంద్రానికి చెందిన రైతు పెద్ద ఆంజనేయ స్వామి సమీపంలోని స్వంత పొలంలో వ్యవసాయ పనులు చూసుకునేవాడు. రూ.30 వేల విలువ చేసే పైపులు గల్లంతు కావడంతో బోరీ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు పేర్కొన్నాడు.

మా ఇళ్లకు స్మార్ట్ మీటర్లు వద్దు

- సీఎంకు క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజల మెయిల్
- స్మార్ట్ మీటర్లు రద్దుపై సీపీఎం విస్తృత ప్రచారం


స్మార్ట్ మీటర్లు వద్దంటూ నిరసన తెలుపుతున్న ప్రజలు

మదనపల్లె రూరల్ : మా ఇళ్లకు స్మార్ట్ మీటర్లు వద్దు సార్ అంటూ పట్టణ ప్రజలు క్యూఆర్ కోడ్ విధానంలో మెయిల్ ద్వారా ముఖ్యమంత్రికి లేఖలు పంపారు. బుధవారం పట్టణంలోని విజయనగర్ కాలనీ, శివాజీ నగర్, గొల్లపల్లి ప్రాంతాలలో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటికి కరపత్రాలు పంచిపెట్టారు. అందులోని క్యూఆర్ కోడ్ ఆధారంగా సీఎం చంద్రబాబు నాయుడుకు మెయిల్ పంపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ.... ప్రజలపై భారాలు వేసే ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ స్మార్ట్ మీటర్లను పెట్టాలనుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని శరవేగంగా అమలు చేయడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రైవేటు కంపెనీల్లో, సంస్థల్లో ఏర్పాటుచేశారని, ప్రజామోదం లేకుండా ప్రజల ఇళ్లకు బలవంతంగా బిగిస్తున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్లు అనేక విధాలుగా ప్రజలకు నష్టదాయకమన్నారు. ఒకో స్మార్ట్ మీటర్ సుమారు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ ఖరీదు ఉంటుందని, దాన్ని ప్రతి నెలా వచ్చే కరెంటు బిల్లులో ప్రజలపైనే భారంగా వేస్తారని చెప్పారు. టైమ్ ఆఫ్ ది డే పేరుతో కరెంటు వాడకాన్ని బట్టి కూడా ఛార్జి ఏ రోజుకారోజు విపరీతంగా పెరిగే అవకాశం ఉందన్నారు. సెల్‌ఫోన్లకు రీఛార్జి చేయించుకున్నట్లే కరెంటుకు కూడా రీఛార్జి చేయించుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. రీఛార్జి చేసుకోకపోతే కరెంట్ సరఫరా నిలిచిపోయే ప్రమాదం కూడా ఉందన్నారు. ఒక నెల కరెంట్ బిల్లు కట్టకపోతే రెండో నెలలో కట్టే సౌకర్యం నేడు ఉందని, స్మార్ట్ మీటర్లు పెడితే అలాంటి సౌకర్యం ఉండదని తెలిపారు. ప్రజలకు నష్టం చేకూర్చే ఇలాంటి స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లను బలవంతంగా పెట్టాలని చూస్తే ప్రజలందరూ ఐక్యంగా వాటిని పగలగొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్రభాకర్ రెడ్డి, కాలనీ ప్రజలు వెంకటాద్రి, చలపతి, శ్రీరాములు, మహేష్, విజయ్, భాగ్యమ్మ, భాగ్యలక్ష్మి, గౌరి, లలిత, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు గైర్హాజరు కాకుండా చర్యలు


బాలికల గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న డీఈఓ సుబ్రమణ్యం

కలికిరి: విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరు కాకుండా చర్యలు తీసుకోవాలని డీఈఓ కె.సుబ్రమణ్యం ఉపాధ్యాయులను ఆదేశించారు. మండలంలోని మహల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తెలుగు)ను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రికార్డులను పరిశీలించిన ఆయన విద్యార్థుల గైర్హాజరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై విద్యార్థుల హాజరు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడిన డీఈఓ ఆగస్టు నెలలో జరుగనున్న ఎఫ్ఎ-1 పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలన్నారు. సిలబస్ పూర్తయిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యాశక్తి కార్యక్రమానికి విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన తెలిపారు. అనంతరం కలికిరి మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. అలాగే మధ్యాద్యాహ్న భోజనం తనిఖీ చేశారు. మెను అమలవుతోందా.. లేదా అని విచారించారు. ఎంపీడీఓ భానుమూర్తి రావు, ఎంఈఓలు కరీముల్లా, నాగార్జున, సీఆర్పీలు రియాజ్, సురేష్ పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

పీలేరు : స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని ఏపీ డీసీఎస్ డివిజన్ ఆఫీస్ వద్ద గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఈఈ వై. చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం లక్ష్యంగా విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రైటర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు రీకాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో సమావేశం

రామసముద్రం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు గురువారం ఉదయం 10:30 గంటలకు రామసముద్రం టీటీడీ కళ్యాణ మండపంలో రీకాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ కేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి గెవన్నలు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ నిస్సార్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలి

తంబళ్లపల్లె: ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు పండ్లతోటలు పెంపకం చేపట్టే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏపీఓ అంజప్ప కోరారు. బుధవారం స్త్రీశక్తిభవనంలో ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం జరిగింది. గ్రామాల్లో రైతులకు పండ్లు, పూలతోటల పెంపకంపై అవగాహన కల్పించాలన్నారు. కూలీలకు కోరిన వెంటనే పనులు చూపెట్టేలన్నారు. ఫారంపాండ్స్, షిప్‌పాండ్స్ పనులను చూపి జరిగిన పనులకు వెంటనే కొలతలు తీసి సకాలంలో కూలీలకు బిల్లులు చెల్లించే విధంగా సహకరించాలన్నారు.

బుద్ధ విగ్రహ ధ్వంసంపై

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు


ఎస్సీ కమిషన్ చైర్మన్ కే.ఎస్.జవహర్‌కు ఫిర్యాదు చేస్తున్న బహుజనసేన అధ్యక్షుడు శ్రీచందు

మదనపల్లె రూరల్ : మదనపల్లె మండలం బుద్ధవిహార్‌లో బుద్ధ విగ్రహం ధ్వంసం, తదనంతరం జరిగిన పరిణామాలపై రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్.జవహర్‌కు, బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు ఫిర్యాదు చేశారు. బుధవారం మదనపల్లె ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్.జవహర్‌ను శ్రీ చందు కలుసుకున్నారు. బుద్ధ విగ్రహ ధ్వంసం కేసులో బుద్ధుని తల తొలగించిన ఉన్మాదులను పోలీసులు అరెస్ట్ చేయకుండా, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన బౌద్ధ ఉపాసకులు పీటీయం.శివప్రసాద్, ప్రజాసంఘాల నాయకులపై పోలీసులు కేసులు నమోదుచేశారని వివరించారు. అన్నమయ్యజిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో, మదనపల్లెలో దళితులు, పోలీసులకు మధ్య వైరం నడుస్తున్న పరిస్థితి ఉందన్నారు. ప్రజాసంఘాలు, ఉద్యమకారులకు నోటీసులు అందిస్తూ, ఇళ్ల దగ్గరకు వెళ్లి పోలీసులు మానసికంగా వేధిస్తున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన ఎస్సీ కమిషన్ చైర్మన్, తమ సమక్షంలోనే ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు ఫోన్‌చేసి, వివరాలు తెలుసుకుని, త్వరలో మదనపల్లెకు వస్తున్నట్లు తెలిపారన్నారు. ఈనెల 28న మదనపల్లెలో జరిగే అతి పెద్ద ఛలో మదనపల్లె కార్యక్రమంపై, ఎస్సీ కమిషన్ చైర్మన్‌తో పాటు హోంశాఖ మంత్రి, డీజీపీ కార్యాలయాలకు మదనపల్లె బుద్ధవిగ్రహ ధ్వంసం అనంతరం జరుగుతున్న పరిణామాలు, పోలీసుల వైఖరిపై ఫిర్యాదుచేశామన్నారు. విజయవాడలోని బుద్ధిస్టులు, ఎస్సీ,ఎస్టీ,బీసీ సంఘాలను 28న జరిగే ఛలో మదనపల్లెకు ఆహ్వానించామన్నారు. కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోస్టల్ సేవలకు తాత్కాలిక అంతరాయం

పెద్దతిప్పసముద్రం: దేశ వ్యాప్తంగా తపాలా సేవలకు ఈ నెల 18 నుంచి 21 వరకు తాత్కాలిక అంతరాయం కలగనుంది. నూతన సాంకేతికతో 2.0 ఆధారంగా ఇళ్ల నుంచే మొబైల్ ఫోన్ ద్వారా పోస్టల్ సేవలు మరింత విస్తృతం కానుంది. తద్వారా పోస్టల్ ఖాతా, బీమాదారుల సౌకర్యార్థం అడ్వాన్స్ టెక్నాలజీని రూపొందించే క్రమంలో తపాలా సేవలను తాత్కాలికంగా నాలుగు రోజుల పాటు నిలిపి వేస్తున్నట్లు పీటీఎం, బి.కొత్తకోట సబ్ పోస్టుమాస్టర్లు రాజారెడ్డి, రెడ్డిశేఖర్ తెలిపారు. 22వ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా తిరిగి పోస్టల్ సేవలు ప్రారంభమవుతాయని, ఖాతాదారులు సహకరించాలని ఎస్‌పీఎంలు కోరారు.

హుండీ ఆదాయం ఆలయ అభివృద్ధికే


ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

కలకడ : హుండీ ఆదాయం అభివృద్ధికి కేటాయించనున్నట్లు మండలంలోని ఎర్రకోటపల్లె పంచాయతీ లో వెలసిన కోటమిట్ట ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భాను ప్రకాష్‌నాయుడు తెలిపారు. పురాతన ఆలయం అభివృద్ధి చేసిన అనంతరం నిత్యం భక్తులు, స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, వారం వారం భజనలు కొనసాగుతున్నట్లు తెలిపారు. భక్తుల భజన చేసేందుకు, రాత్రి సమయంలో అల్పాహారం ఏర్పాటు వంటివి కొనసాగుతున్నట్లు తెలిపారు. ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలు, వితరణ నగదు రూ.7వేలకు పైగా రాగా నిత్యపూజలు, దీపదూపనైవేద్యం, ఆలయ అభివృద్ధికి కమిటీ సభ్యుల ఆమోదం మేరకు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. భక్తులు స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఆషాఢమాసం మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ ప్రత్యేక పూజలు, భజనలు, మంగళహారతి అనంతరం హుండీ ఆదాయం లెక్కించినట్లు తెలిపారు.

టీకాలను సద్వినియోగం చేసుకోండి

కలకడ : జిల్లాలోని పాడి పశువులకు ప్రభుత్వం ఉచితంగా అందించే థైలేరియసిస్ టీకాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై కోరారు. బుధవారం మండలంలోని కలకడ ప్రభుత్వ వెటర్నిటీ ఆసుపత్రి పరిధిలోని కె.బాటవారిపల్లె పంచాయతీ పోతువారిపల్లెలో పశువులకు టీకాలు వేసి ప్రారంభించారు. ప్రతి గ్రామంలో పవువైద్యసిబ్బంది పర్యటించి విధిగా ప్రతి 3నెలలు నిండిన లేగదూడలకు, పశువులకు టీకాలు అందించాలని ఆదేశించారు. జిల్లాకు 18వేల డోసులు మంజూరై సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సహాయ సంచాలకులు క్రిష్ణయ్య, సిబ్బంది లోకేష్, శివారెడ్డి, డాక్టర్ తేజకళ్యాణ్, ఆర్‌ఎస్కే సహాయకులు మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రేమ ప్రవాహిని రథయాత్ర


ప్రేమప్రవాహిని రథయాత్ర

మదనపల్లె సిటీ: భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మదనపల్లెలో మంగళవారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయి ప్రేమప్రవాహిని రథయాత్ర నిర్వహించారు. పుంగనూరు బైపాస్‌రోడ్డు నుంచి వాహనంలో సత్యసాయిబాబా చిత్రపటంతో పాటు పాదుకలు ప్రత్యేక అలంకరించారు. ఈ యాత్రకు భక్తులు అడుగడుగునా నీరజాలు పలికారు. బాబా నామస్మరణలు, భజనలతో రథయాత్ర పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ సత్యసాయిబాబా బోధనలు ప్రజలకు తెలియజేసేందుకు యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. బాబా చేసిన సేవ, శాంతి,ప్రేమ వంటి బోధనలు ఇప్పటికి చిరస్మరణీయమన్నారు. ప్రజలు ఆయన చూపిన బాటలో నడవాలన్నారు. రథయాత్రలో పెద్ద ఎత్తున భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో మధ్యవర్తిత్వమే కీలకం

తంబళ్లపల్లె: ఎలాంటి సమస్యల పరిష్కారంలోనైనా మధ్యవర్తిత్వమే కీలకమని న్యాయవాది గఫార్ తెలిపారు. బుధవారం మధ్యవర్తిత్వంతో సామరస్య పూర్వకంగా సమస్యలు పరిష్కారంపై అవగాహన కల్పించారు. మధ్యవర్తిత్వంతో ఇరువర్గాల సామరస్యపూర్వకంగా సమస్యలు పరిష్కరించుకోవచ్చునన్నారు. దీంతో సమయం ఆదాతో పాటు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉండదన్నారు. గిరిజన బాలుర హాస్టల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అంతర్జాతీయ ఉడ్‌బాల్ పోటీలకు ఎంపిక

మదనపల్లె రూరల్ : అంతర్జాతీయ త్రోబాల్, ఉడ్‌బాల్ పోటీలకు శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని కరస్పాండెంట్ డాక్టర్. రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఈ ఏడాది జూన్‌లో మహారాష్ట్ర నాగపూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి ఉడ్‌బాల్ పోటీల్లో కళాశాల విద్యార్థులు సతీష్, జానకమ్మలు అత్యుత్తమ ప్రతిభ కనపరిచి అంతర్జాతీయ జట్టుకు ఎంపికయ్యారన్నారు. వీరిద్దరూ ఆగస్టులో ఇండోనేషియాలో నిర్వహించనున్న అంతర్జాతీయ ఉడ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. అలాగే ఇటీవల చెన్నైలో నిర్వహించిన జాతీయ స్థాయి త్రోబాల్ పోటీల్లో కళాశాల విద్యార్థి పురుషోత్తం ప్రతిభ చూపి అంతర్జాతీయ త్రోబాల్ జట్టుకు ఎంపికయ్యాడన్నారు. ముగ్గురు క్రీడాకారులు విదేశాలకు వెళ్లి అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఒకొక్కరికి రూ.50వేలు చొప్పున రూ.1.50 లక్షల నగదును కళాశాల తరఫున అందించామన్నారు.

ట్రాన్స్‌పోర్ట్‌లో నిల్వ ఎరువులు సీజ్


ఎరువులు, పురుగు మందులను పరిశీలిస్తున్న విజిలెన్స్, వ్యవసాయాధికారులు

కలికిరి: పట్టణంలో ఓ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో నిల్వ వున్న ఎరువులు, పురుగు మందులను విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు సీజ్ చేశారు. కలికిరిలో బుధవారం విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు ఎరువులు, పురుగుమందుల దుఖానాలపై దాడులు నిర్వహించారు. అలీ ట్రేడర్స్ షాపులో రతూ.2.31లక్షలు విలువ చేసే 12మెట్రిక్ టన్నులు ఎరువులు జీఎస్టీ పరిధిలో లేని గోడౌన్‌లో ఉంచడంతో ఆ ఎరువులు విక్రయించకుండా నిలుపుదల చేశారు. అలాగే శిరి ఆగ్రోమార్ట్‌లో రూ.72500 విలువ చేసే 0.95 మెట్రిక్ టన్నుల ఎరువులను కూడా జీఎస్టీ పరిధిలో లేని గోడౌన్‌లో గుర్తించి విక్రయించకుండా నిలుపుదల చేశారు. తదుపరి జీఎస్టీ పరిధిలోకి వచ్చిన తరువాత వ్యవసాయశాఖ అధికారుల అనుమతితో విక్రయించాల్సి ఉంటుందన్నారు. మరో రెండు ఎరువుల దుఖానాలకు సరఫరా అయిన ఎరువులు, పురుగు మందులు గత 60 రోజులుగా ట్రాన్స్‌పోర్ట్‌లోనే ఉండిపోవడంతో వాటిని స్థానిక రెవెన్యూ అధికారుల సమక్షంలో సీజ్ చేశారు. సంబంధిత కంపెనీ ప్రతినిధుల విచారణ అనంతరం చర్యలుంటాయాని విజిలెన్స్ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు ఏఎస్ ఎల్లప్ప, ఎస్ చంద్రశేఖర్, ఏఒలు హేమలత, పవన్ కుమార్, విఆర్ఓ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు టీకాలు తప్పనిసరి


టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న వెటర్నరీ డీడీ నీరజ

నిమ్మనపల్లె : పశువుల్లో వ్యాధుల నివారణకు టీకాలు తప్పనిసరి అని మదనపల్లె డివిజన్ వెటర్నరీ డీడీ నీరజ అన్నారు. బుధవారం మండలంలోని గుడ్లవారిపల్లె, తవళం గ్రామాల్లో జరుగుతున్న టీకాల పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పాడి ఆవుల్లో బొబ్బలవ్యాధి(ముద్దచర్మవ్యాధి) రాకుండా ప్రభుత్వం ఉచితంగా టీకాలు అందజేస్తోందన్నారు. పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులు చర్మంపై బొబ్బలు రావడం, అధిక శరీర ఉష్ణోగ్రతలు నమోదై సరిగ్గా మేత మేయకపోవడం వల్ల పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుందన్నారు. నాలుగునెలల వయస్సు పైబడిన పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాస పెంపకం, పశుబీమా పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నిమ్మనపల్లెలోని వెటర్నరీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వెటర్నరీ అధికారి సురేష్, సిబ్బంది మునీంద్ర, బాబా జాకీర్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

కూటమి ఏడాది పాలనపై వ్యతిరేకత


ముత్యాలమ్మ ఆలయం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో నిసార్ అహ్మద్

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్

మదనపల్లె రూరల్ : కూటమిప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను సక్రమంగా నెరవేర్చకపోవడంతో ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. బుధవారం మండలంలోని పొన్నూటిపాలెం పంచాయతీ రామిరెడ్డిగారిపల్లె గ్రామదేవత ముత్యాలమ్మ జాతరకు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డితో కలిసి హాజరయ్యారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, గోపీనాథ్‌రెడ్డితో కలిసి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ బలోపేతంపై చర్చించారు. చంద్రబాబు మోసాలను ఇంటింటికీ తీసుకెళ్లి, జగన్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంను ప్రజలకు గుర్తు చేయాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటే, ఆయా కుటుంబాలకు ఎంత మేలు జరిగేది...ఇప్పుడు ఏమి జరిగిందనేది వివరించి ప్రజలకు అండగా నిలవాలన్నారు. ఇప్పటికే ప్రజలకు జగనన్న ముఖ్యమంత్రిగా లేకపోవడం వల్ల కలిగిన నష్టం అర్థమైందని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్సార్ సీపీని అధికారంలోకి తెచ్చుకోవాలని సిద్ధంగా ఉన్నారన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల్లో పార్టీ పూర్వవైభవానికి ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషిచేయాలన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారన్నారు. వైఎస్సార్ సీపీ బలోపేతం దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చిప్పిలి నరసింహారెడ్డి, బాబి, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, మునిశేఖర్, బైసాని చంద్రారెడ్డి, మల్లికార్జున, రేవతి, నర్సింహులు, శ్రీకాంత్, చిన్న, అపర్ణ, మంజుల, శారదారెడ్డి, నాగమణి, యూనస్, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు ఆదాయానికి మలుపు


బహుమతులు అందజేస్తున్న చేస్తున్న డీఎం నిర్మల

పీలేరు రూరల్ : ఇంధన పొదుపు ఆర్టీసీ ఆదాయానికి మలుపు లాంటిదని పీలేరు డిపో మేనేజర్ బి. నిర్మల అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్‌లో జూన్‌లో అత్యధిక కేఎంపీఎల్ సాధించిన ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెలలో అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్ ఎం.ఆర్. మూర్తి, కె. నాగరాజులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేసినట్లు తెలిపారు. డ్రైవర్, కండక్టర్లు ఇందనం పొదుపు, ఓఆర్ పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఖర్చు తగ్గించి ఆర్టీసీ ఆదాయం పెంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ ధనుంజయలు, గ్యారేజ్ ఎంఎఫ్ హరినాథరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఆదర్శనీయం


పారిశుద్ధ్య కార్మికులకు వస్తు సామగ్రి పంపిణీ చేస్తున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరురూరల్ : పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఆదర్శనీయమని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నమస్తే షాపాయి కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు గ్రామ పంచాయతీలో పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పట్టణంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కార్మికులకు గ్లౌజులు, టవళ్లు, షూ తదితర పారిశుద్ధ్య పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో లతీఫ్‌ఖాన్, వార్డు మెంబర్లు మల్లికార్జునరెడ్డి, రమణ, ఉదయ్, కాలేషా, అబీద్, పరమేష్, షాజహాన్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛసర్వేక్షన్‌ను పరిశీలించిన కేంద్ర బృందం


కురిజలలో స్వచ్ఛసర్వేక్షన్‌ను పరిశీలిస్తున్న కేంద్రబృందం సభ్యులు

రామసముద్రం: మండలంలోని కురిజల గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ 2025 కార్యక్రమాన్ని బుధవారం కేంద్ర బృందం సభ్యులు హేమంత్ పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం, మురుగునీటి నిర్వహణ, తడిచెత్త, పొడిచెత్త నిర్వహణ, ఎస్‌డబ్ల్యూపీసి షెడ్ సందర్శించి కంపోస్ట్ తయారీ గురించి మరుగుదొడ్ల వినియోగం గురించి గ్రామాల్లోని కుటుంబాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే అంగన్‌వాడీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల్లోని మరుగుదొడ్లు, సామూహిక మరుగుదొడ్లు వినియోగం , పారిశుద్ధ్య నిర్వహణ, పరిస్థితులు గురించి సర్వే నిర్వహించి, ఆ గ్రామ పంచాయతీలకు ర్యాంకులు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.మంగమ్మ, ఎంపీడీవో గఫూర్, ఎంపీటీసీ దొడ్డిపల్లి ఆనంద, రీసోర్స్ పర్సన్ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రెడ్డినరసింహులు, ఇంజనీరింగ్ , వెల్ఫేర్ సహాయకులు శ్రావణి, సుబ్రమణ్యం, ఆశావర్కర్ రత్నమ్మ, సంఘమిత్ర భూలక్ష్మీ, ఏఎన్‌ఎం రుక్మిణి , గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.